
సాక్షి
సిద్దిపేట
గురువారం : 4 : జూలై : 2024



ఉద్యానానికి.. ఊతమేదీ?

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం కరువైంది. దీంతో సాగు చేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. వివరాలు 8లో ▸



ప్రవేశాలపై దృష్టి సారించాలి

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెంచేలా దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి హిమబిందు అన్నారు. వివరాలు 8లో ▸



భాగస్వాములవుదాం

రాజకీయాలకతీతంగా అభివృద్ధిలో అందరం భాగస్వాములవుదామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కానిస్టేబుల్ సస్పెన్షన్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ముస్తఫా సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు సీపీ అనురాధ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, పోలీసు వ్యవస్థ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని సీపీ తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన ఎంపీపీ, ఎంపీటీసీలు



కేసీఆర్‌కు మెమెంటో అందజేస్తున్న ఎంపీపీ దంపతులు

ములుగు(గజ్వేల్): మాజీ సీఎం కేసీఆర్‌ను ములుగు ఎంపీపీ లావణ్యఅంజన్‌గౌడ్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో కేసీఆర్‌ను కలిసి శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. అంతకు ముందు ములుగు ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ వెంకటరామకృష్ణ, వివిధ శాఖల అధికారులు జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సత్కరించారు.

మద్దతు ధరలు పెంచాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా మద్దతు ధరలు పెంచాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. బుధవారం రైతు సంఘం సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల 14 రకాల పంటల మద్దతు ధరలను నిర్ణయించిందని, అవి గత సంవత్సరంతో పోలిస్తే కేవలం ఐదు శాతం మాత్రమే అని అన్నారు. ఉత్పత్తుల ఖర్చులు మాత్రం 20 నుంచి 25 శాతం పెరిగాయని ఆవేదన్యక్తం చేశారు. రైతులు పండించే పంటలకు 50శాతం మద్దతు ధరపెంచి ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యాక్షుడు కృష్ణారెడ్డి, నీల భిక్షపతి, సాయిలు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సిద్దిపేటఅర్బన్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. సైబర్ జాగరూకత దివస్‌లో భాగంగా బుధవారం పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ మొబైల్ వినియోగం పెరిగిపోవడం వల్ల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని అన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు సమాచారం ఇవ్వాలన్నారు.



ఆ పల్లెలో అడుగు పెడితే చాలు.. పచ్చని చెట్లు స్వాగతం పలుకుతాయి. ఆ చెట్ల నీడన వెళ్తుంటే చల్లని గాలులు మనసుకు హాయిని కలిగిస్తాయి.. చుట్టూ చెట్లు, పంట పొలాలు మధ్యలో పెంకుటిళ్లతో కనువిందు చేస్తోంది ఈ గ్రామం. ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి, చెరువు అందాలు మనస్సును హత్తుకుంటాయి. ఇందుకు ప్రధాన కారణం గ్రామస్తులంతా పర్యావరణాన్ని రక్షిస్తూ.. మొక్కలను పెంచుతుండటమే. అదే తొగుట మండలం తుక్కాపూర్ గ్రామం.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

ఉన్నట్టా?.. లేనట్టా?



చేప పిల్లల పంపిణీపై నీలినీడలు

- ఇంకా ప్రారంభం కాని పథకం
- ప్రతి ఏడాది జూలై నుంచి ఆగస్టు వరకు సరఫరా
- 368 సంఘాల్లో 23,971 మంది సభ్యులు
- జిల్లాలో 1,588 చెరువులు

మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లల పంపిణీ పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడంతో పథకం ఉంటుందా? ఉండదా? అన్న సందిగ్ధం నెలకొంది. మత్స్యకారుల అభ్యున్నతి కోసం, చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఏడాది మే నెల చివరలో టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యేది. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

జిల్లా వ్యాప్తంగా 368 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. అందులో పురుషులవి 330, మహిళల సంఘాలు 38 ఉన్నాయి. ఈ సంఘాల్లో సభ్యులు 23,971 మంది ఉన్నారు. గతేడాది 1,349 చెరువుల్లో 1,67,50,046 చేప పిల్లలు 35 నుంచి 40ఎంఎం పొడవున్నవి పంపిణీ చేశారు. 239 చెరువుల్లో 80 నుంచి 100ఎంఎం చేప పిల్లలు 2,57,47,992, రొయ్యలు 51,26,200 వదిలారు. మొత్తంగా 20,210 టన్నుల చేపలు ఉత్పత్తయ్యాయి. ఇలా చేపల ద్వారా మత్స్యకారులు ఆదాయం పొందారు.

ప్రతి ఏటా జూలై నుంచి..

చేప పిల్లల పంపిణీ కోసం ఏప్రిల్ నెలలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం అయ్యేది. జూలై నుంచి ఆగస్టు వరకు చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అలాంటిది జూలై నెల ప్రారంభమైనా ఇప్పటికీ టెండర్లు నిర్వహించలేదు. చెరువుల్లో 35 నుంచి 40ఎంఎం, 80 నుంచి 100 ఎంఎం పొడవున్న చేపపిల్లలను వదులుతారు. అవి కిలో సైజులో పెరగాలంటే కనీసం ఆరు నుంచి 8నెలల సమయం పడుతుంది. జూలై నెలలో వదిలితేనే డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు చేపలను పట్టి విక్రయించుకునే అవకాశం ఉంటుంది. చేప పిల్లలను ఆలస్యంగా వదిలితే ఎదుగుదలపై ప్రభావం పడనుంది. సెప్టెంబర్‌లో వదిలితే అవి కిలో సైజు పెరగాలంటే మార్చి దాటుతుంది. ఇంకా పెరగాలంటే వేసవి వచ్చేస్తుంది. ఉష్ణోగ్రతల కారణంగా చేపలు చనిపోయే ప్రమాదం ఉంటుందని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయమైనా అందించాలి

ఉచిత చేప పిల్లల పంపిణీపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో నేరుగా మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు. తద్వారా నచ్చిన రకం చేపపిల్లలను కొని చెరువుల్లో వేసుకుంటామని వారు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల నుంచి సేకరించి సంఘాలకు అప్పగించటానికి కనీసం రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుంది. అలాగే చేప పిల్లల పంపిణీలో కాంట్రాక్టర్లు పలు అవకతవకలకు పాల్పడుతున్నారని మత్స్యకారులు ఆరోపించారు. అందుకే మత్స్యకారులకు నేరుగా సాయం అందించాలని పలువురు మత్స్యకారులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదేశాలు రాలేదు..



ఈ సంవత్సరం చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం. వర్షాలు కురిసి చెరువులు నిండేలోగా చేప పిల్లల పంపిణీ చేపట్టే అవకాశం ఉంది.

– మల్లేశం, జిల్లా మత్స్యశాఖ అధికారి



ఎంపీపీ కీర్తి దంపతులను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ(హుస్నాబాద్): అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానని, నిధులు గ్రామీణ ప్రాంతాలకు చేరేలా కృషి చేస్తానని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడ మండల సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిధులు, పనుల కోసం గవర్నర్‌ను కలిసే పరిస్థితి వచ్చిందన్నారు. చట్టసభలలో కేటాయించిన నిధులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరవేసే వేదిక ఈ సర్వసభ్య సమావేశం అన్నారు. గత ఐదేళ్లలో ప్రజాస్వామ్యబద్దంగా కొన్ని కార్యక్రమాలు చేసినా, మరికొన్ని చేయలేకపోవచ్చు, కానీ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. అంతకు ముందు సభలో సభ్యులు సమస్యలను మంత్రి ఎదుట ప్రస్తావించారు. రోడ్లు, వంతెనలు, తాగు నీటి సమస్యలు ఉన్నాయని సభ్యులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. గడిచిన ఐదేళ్లలో నిధుల కొరతతో ప్రజలకు పూర్తి స్థాయిలో అభివృద్ధి, న్యాయం చేయలేక పోయమని.. తమకు గౌరవ వేతనం కూడా మంజూరు కాలేదని పరివేద ఎంపీటీసీ సభ్యుడు వేముల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌కు తొలి మంత్రిగా ఉన్న మీరు అన్నిరంగాలలో నియోజక వర్గాన్ని ముందకు తీసుకువెళ్లేలా విధంగా కృషి చేయాలని కోరారు. హుస్నాబాద్ నియోజక వర్గాన్ని ఆదర్శంగా నిలిచేలా.. గౌరవం వచ్చేలా అభివృద్ధి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి శాలువలు కప్పి ఘన వీడ్కోలు పలికారు. మళ్లీ ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజలకు సేవా చేసేందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్యామల, ఎంపీపీ కీర్తి, ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తా

హుస్నాబాద్: పద్మశాలీల ఉపాధి కల్పన కోసం మౌలిక సదుపాయలు కల్పిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భగవాన్ నేత, పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోలి వెంకటనారాయణతో పాటు పద్మశాలి సంఘం నాయకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీల సమస్యలపై ప్రత్యేక శ్రద్ద తీసుకొని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 292 మంది విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాసర ట్రిపుల్ ఐటీలో జిల్లాకు చెందిన 292 మంది విద్యార్థులు సీట్లు పొందారు. బుధవారం ప్రకటించిన మెరిట్ లిస్ట్‌లో అధిక మంది సీట్లు సాధించారు. అత్యధికంగా చిన్నకోడూరు మండలంలో 62 మంది, నంగునూరు మండలం నుంచి 61 మంది, సిద్దిపేట అర్బన్ మండలంలో 26మంది, సిద్దిపేట రూరల్ నుంచి 11మంది, నారాయణరావుపేట మండలం నుంచి 11మంది సీట్లు సాధించారు. అలాగే సిద్దిపేట రూరల్ నుంచి 11మంది, హుస్నాబాద్ మండలంలో తొమ్మిది మంది, కోహెడలో 30 మంది, రాయిపోల్‌లో ఆరుగురు సీట్లు పొందారు. అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి, దుబ్బాక మండలాలలో 31 మంది, తదితర మండలాల నుంచి కూడా విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. పదోతరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట జిల్లా కొన్నేళ్లుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తోందన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో సిద్దిపేట జిల్లా విద్యార్థులు అధికంగా సీట్లు పొందడం సంతోషంగా ఉందన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి
- గజ్వేల్‌లో ఐఎంఏ నూతన భవనానికి ప్రారంభోత్సవం



ఐఎంఏ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్: ప్రజలకు మెరుగైన సేవలందించడమే వైద్యుల లక్ష్యం కావాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) నూతన భవనాన్ని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విజయరావు, గజ్వేల్ శాఖ అధ్యక్షులు డాక్టర్ లింగంలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలోని వైద్యులకు విశేష ప్రజాదరణ ఉందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఐఎంఏకు ప్రత్యేకమైన భవన సదుపాయం ఉండాలనే తమ కృషి ఫలించిందని, దీనికి సహకరించి వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర కోశాధికారి రాజేంద్రకుమార్‌యాదవ్, గజ్వేల్ శాఖ ప్రధాన కార్యదర్శి మహిపాల్, కోశాధికారి సుజాత, సీనియర్ వైద్యులు పెంటాచారి, నరేష్ బాబు, వాసవాచారి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే

పదవులు శాశ్వతం కాదు.. ప్రజాసేవే ముఖ్యం

- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- దుబ్బాకలో ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు



జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

దుబ్బాక: అధైర్యపడవద్దని, భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదేనని, పదవులు శాశ్వతం కాదు.. ప్రజాసేవలో ముందుకు సాగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, ఇతర నామినేటెడ్ ప్రతినిధుల ఆత్మీయ వీడ్కోలు సభ బుధవారం దుబ్బాకలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా హాజరై హరీశ్‌రావు మాట్లాడారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే అధైర్యపడకండి.. అన్ని విధాలుగా కార్యకర్తలకు అండగా ఉంటమన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. దుబ్బాక నియోజకవర్గంపై తనకు ప్రత్యేక ప్రేమ ఉందన్నారు.

హరీశ్‌రావు కృషి మరువలేనిది..

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో నాటి సీఎం కేసీఆర్ అడుగులో అడుగై పనిచేసిన హరీశ్‌రావు కృషి మరువలేనిదని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మీ హయాంలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని కొనియాడారు. భవిష్యత్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సత్తా చాటాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి 8 నెలలు అవుతున్నా ఒక్క అభివృద్ధి పనికి కూడా కొబ్బరికాయ కొట్టలేదని, ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. ఉద్యమాలు, ప్రజాపోరాటాలు దుబ్బాక ప్రజలకు కొత్త కాదని ప్రజలతో కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ సభలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు తదితరులు ఉన్నారు.

కావాలనే సర్కార్ కాలయాపన



పదవీ కాలం ముగిసిన ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న హరీశ్ రావు

సిద్దిపేటజోన్: రైతుబంధు డబ్బుల్లో కోత విధించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. బుధవారం సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో పదవీ కాలం పూర్తి చేసుకున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దున్నకాలకు, వరి నాట్లకు, ఎరువులకు ఉపయోగపడేలా రైతు భరోసా డబ్బులు కావాలి. కానీ ఇప్పటివరకు అన్నదాతలకు డబ్బులు రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వచ్చేది మళ్ళీ మన ప్రభుత్వమేనన్నారు. కొత్త ప్రభుత్వంలో ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులను కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. 24 గంటల విద్యుత్, కాలంతో పనిలేకుండా కాళేశ్వరం నీళ్లతో రైతులకు పంట వేయాలని గతంలో నమ్మకం ఉండేదని, ఇప్పుడు పంట వేయాలంటే జంకుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్స్, మాజీ జడ్పీటిసిలు ,మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రోత్ మేళా

విజయవంతం చేయాలి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- వివిధ శాఖల అధికారులతో సమావేశం

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా 5 ఏళ్లలోపు పిల్లల కోసం నిర్వహిస్తున్న గ్రోత్ మేళాను అధికారులు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రోత్ మేళా కార్యక్రమంపై మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5 ఏళ్లలోపు పిల్లలందరికీ బరువు ఎత్తు కొలిచే మేళాను సంబంధిత శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు. పిల్లల బరువు, ఎత్తును సక్రమంగా నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గ్రోత్ మేళాపై ప్రచారం నిర్వహించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాలు కార్యక్రమానికి సహకారం అందించాలన్నారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు బాలామృతం, గుడ్లు, పాలు సరిగ్గా అందేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది గుర్తించిన చిన్నారులను సిద్దిపేటలోని జనరల్ ఆస్పత్రిలోని న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ కేంద్రానికి పంపించాలన్నారు. మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు సౌకర్యం లేని ప్రభుత్వ భవనాలు కలిగిన అంగన్వాడీ కేంద్రాల్లో వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. నిర్మాణ దశలలో ఉన్న అంగన్వాడి కేంద్రాల పూర్తికి కావాల్సిన నిధులకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారి శారద, డీపీఓ దేవకీదేవి, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, మెప్మా పీడీ హనుమంత్‌రెడ్డి, ఈఈ పంచాయతీరాజ్, సీడీపీఓలు అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

ఫ్యాక్టరీ నిర్మాణం త్వరగా చేపట్టండి

నంగునూరు(సిద్దిపేట): జిల్లాలో ఆయిల్‌పామ్ దిగుబడి ప్రారంభమైనందున ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. నర్మేటలో రూ. 300 కోట్లతో చేపట్టిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై ఆరా తీయగా ఓవర్‌హెడ్ ట్యాంక్, ల్యాబ్ స్టోరేజ్ భవనం, ఫాంపాండ్ నిర్మాణాలు పూర్తయ్యాయని ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి వివరించారు. అలాగే ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి నిర్మాణం దశలు, ఆయిల్ తయారయ్యే విధానం, చేపట్టిన ఇతర నిర్మాణాలను మ్యాప్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సువర్ణ, టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రవేశాలపై దృష్టి సారించాలి

డీఐఈఓ హిమబిందు



డీఐఈఓను సత్కరిస్తున్న సంఘ బాధ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) హిమబిందు అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో బుధవారం స్థానిక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచి, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఐఈఓను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కిషన్, బాధ్యులు సత్యనారాయణ రెడ్డి, రాంచంద్రా రెడ్డి, దేవస్వామి, రాజన్న, వాసవి, ఇందిర, బుచ్చిరెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సురేష్‌రెడ్డి, భూపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పటిక బెల్లం పట్టివేత

పలువురిపై కేసు నమోదు



నిందితులను చూపుతున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్రమంగా ఓ ఆటోలో తరలిస్తున్న పటిక బెల్లంను ఎక్సైజ్ శాఖ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. హుస్నాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ పవన్ కథనం మేరకు.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన భాషబోయిన లింగం, విజయ, అక్కన్నపేట మండలం చౌటకుంట తండాకు చెందిన భూక్య శంకర్, దూల్మిట్ట మండలానికి చెందిన భానోతు శ్రీనివాస్ కలిసి పటిక సరఫరా చేస్తున్నారు. ఆటో రిక్షాలో తరలిస్తున్న 400 కిలోల పటిక బెల్లంతోపాటు 8 లీటర్ల నాటు సారాను మంగళవారం రాత్రి అక్కన్నపేట మండలంలోని నందారం క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నాం. వీరిపై కేసు నమోదు చేయగా శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీధర్, హుస్నాబాద్ ఎస్సై దామోదర్, చేర్యాల ఎస్సై సురేశ్, పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

9 తులాల బంగారం, నగదు అపహరణ



శివ్వంపేట(నర్సాపూర్): పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధి సికింద్లాపూర్ చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దొంతికె మహేశ్, భార్య లావణ్య బుధవారం పిల్లలను పాఠశాలకు పంపించారు. అనంతరం దంపతులిద్దరూ ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం పిల్లలు పాఠశాల నుంచి వస్తారని తాళం చెవి ఆరు బయట ఉన్న బాత్రూంలో దాచి ఉంచారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం చెవి తీసుకొని ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మళ్లీ తాళం చెవి యధావిధిగా పెట్టి వెళ్లారు. పొలం పనులు ముగించుకొని ఇంటికొచ్చిన దంపతులు చోరీ జరిగిన విషయం గుర్తించారు. బీరువాలోని 9 తులాల బంగారం, రూ.20 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు మహేశ్ పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు.

ఉద్యానానికి.. ఊతమేదీ?

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం కరువు

- మొక్కలు, డ్రిప్ పరికరాలు నిలిపివేత
- రైతులే కొనుగోలు చేయాలంటున్న ప్రభుత్వం
- జిల్లాలో 727 ఎకరాల్లో సాగుకు 416 మంది దరఖాస్తు
- ఆసక్తి ఉన్నవారికి తప్పని నిరాశ



జిల్లెలగడ్డలో రైతు సాగు చేసిన మామిడి తోట

జాతీయ ఉపాధిహామీ పథకంలో ఉద్యావన పంటలు సాగు చేసుకొని రైతులకు గత ప్రభుత్వంలో పండ్ల మొక్కలను, డ్రిప్ పరికరాలను సబ్సిడీ పై సరఫరా చేసేది. వేసవి కాలంలో ఉపాధి హామీ అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ రైతులకు అవగాహన కల్పించడంతో జిల్లా వ్యాప్తంగా 416 మంది రైతులు 727 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి ముందుకొచ్చారు. ప్రభుత్వం మొక్కలు సరఫరా బాధ్యత నుంచి తప్పుకోవడంతో పండ్ల తోటలను సాగు చేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు.

హుస్నాబాద్ రూరల్: వ్యవసాయానికి అనుబంధంగా పండ్ల తోటలను సాగు చేయించడానికి ఉద్యావన శాఖ అధికారులు, జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేశారు. రెండు శాఖలు సంయుక్తంగా రైతులను ఎంపిక చేసి ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించి సబ్సిడీపై మొక్కలను కొనుగోలు చేసి రైతులకు అందించేది. గిరిజన తండాల ప్రాంతంలో చాల మంది రైతులు రాళ్ల భూముల్లో పండ్ల తోటలను సాగు చేసుకునేవారు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా తోటల సాగు చేయించేవారు. మొక్కలు నాటింది మొదలు మూడేళ్ల వరకు సాగు నిర్వహణ ఖర్చులను ఉపాధిహామీ పథకంలో అధికారులు చెల్లించేది. రాళ్ల భూముల్లో తోటలను పెంచిన రైతులు అంతరు పంటల సాగుతో పాటు వారి భూములను సాగుకు యోగ్యంగా మార్చుకున్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటలు..

మామిడి, నిమ్మ, సపోట, ఆయిల్ పామ్, మునుగ, జామ, ఆపిల్ బేరు, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, బత్తాయి, దానిమ్మ లాంటి పండ్ల తోటలను పెంచుకోవడానికి అధికారులు రైతులను ప్రోత్సహించారు. పండ్ల తోటలు పెంచడానికి ముందుకు వచ్చిన రైతులు ఉద్యావనశాఖ ద్వార సబ్సిడీ పైపు లైన్లు, డ్రిప్ పరికరాలు ఇవ్వడంతో చాలా మంది రైతులు వరి, పత్తి పంటల సాగును బంద్ చేసి తోటల సాగు చేపట్టారు. ఈ ఏడాది తోటలు సాగు చేసేందుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు మొక్కలనుకొనుగోలు చేసుకోవాలని చెప్పడంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. కొబ్బరి లాంటి మొక్కలను పొలాల గట్ల పై పెంచితే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఆలోచించి సబ్సిడీ పై మొక్కల సరఫరాతో పాటు పైపు లైను, డ్రిప్ పరికరాలను సరఫరా చేయాలని కోరుతున్నారు.

నిర్వహణ ఖర్చు ఇస్తాం



రైతులకు పండ్ల తోటలపై అవగాహన కల్పిస్తే మండలంలో 32 ఎకరాల్లో సాగు చేయడానికి ముందుకొచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు మొక్కలు కొనుగోలు చేసుకొని బిల్లులు పెట్టుకుంటే ఉపాధి హామీ పథకంలో వారికి మొక్కకు నిర్దేశించిన ధర ప్రకారం బిల్లులు చెల్లిస్తాం.

– పద్మ, ఏపీఓ ,హుస్నాబాద్

సబ్సిడీపై ఇస్తేనే పెడుత..



ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో కొబ్బరి మొక్కలు ఇస్తదంటే మా పొలం గట్టు పైన నలుబై మొక్కలు నాటుదామని రాయించిన. ఇప్పుడు ప్రభుత్వం రైతులే మొక్కలు కొనుగోలు చేసుకుంటే తర్వాత బిల్లులు చెల్లిస్తామని చెప్పుతున్నారు. మేం మొక్కలు తెచ్చుకోవాలంటే నా వ్యవసాయ పనులు ఇడిసిపెట్టుకొని మొక్కలకు పోవాలే. ప్రభుత్వం ఇస్తే మంచి మొక్కలు ఇస్తారని నమ్మకం ఉంటది. మొక్కలు పెట్టుడు బంద్ చేసిన.

– పోశవేని కొమురయ్య, రైతు, కిషన్‌నగర్

రైతులే తెచ్చుకోవాలి



గతంలో ఉద్యావనశాఖ, ఉపాధి హామీ రెండు శాఖ సంయుక్తంగా మొక్కలు సరఫరా, డ్రిప్ లాంటి పరికరాలను సరఫరా చేసేది. ఇప్పుడు రైతులకు నచ్చి హైబ్రీడ్ మొక్కలు తెచ్చుకుంటే ఆ మొక్కల ధరలను బట్టి బిల్లుల ఉపాధిహామి పథకంలో చెల్లించే అవకాశం ఉంది. మొక్కలు కాతకు వచ్చే వరకు మూడేళ్లు ఉపాధి హామీ కూలీలతో పనులు చేయిస్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, హుస్నాబాద్

మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- వివిధ కోర్సులలో 274 ఖాళీలు
- వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు వెల్లడి

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నారు. వివిధ డిగ్రీ కోర్సుల్లో 274 ఖాళీలు ఉండగా స్పాట్ అడ్మిషన్ కోసం ఈ నెల 4 గురువారం నుంచి 8 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, దూరభారం తగ్గించేందుకు వాట్సాప్ ద్వారా కూడా వివరాలు పంపాచ్చని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ రావు తెలిపారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్ కల్పిస్తామన్నారు. అర్హతలు తదితర వివరాలను ఆయన వెల్లడించారు.

- కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ కోసం అభ్యర్థి రాష్ట్రంలో ఎక్కడైనా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణురాలై ఉండాలి. కంపార్ట్‌మెంటల్ పాసైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష రాయనివారు కూడా అర్హులే.
- ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా కళాశాలలో లేదా వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేయవచ్చు. దరఖాస్తుదారు తన పేరు, తండ్రి పేరు, ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులు, కులం (క్యాస్ట్), చేరాలనుకుంటున్న కోర్సు, తమ చిరునామా, వాట్సాప్ నంబర్ వివరాలతో 97035 29664 నంబర్‌కు వివరాలు పంపితే దరఖాస్తుగా పరిగణిస్తారు. వివరాల కోసం 97035 29664, 79950 76688 నంబర్లలో సంప్రదించవచ్చు.
- ఈ నెల 10న స్పాట్ అడ్మిషన్ల కోసం హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, 3 జిరాక్స్‌లు, 15 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలను తీసుకొని రావాలి. మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. సీటు లభిస్తే రూ.2,425 రుసుం వెంటనే చెల్లించి గురుకులంలో చేరాలి. ఇందుకు వీలుగా సామగ్రితో సహా రావాలని ప్రిన్సిపాల్ భాస్కర్ రావు సూచించారు.

వివిధ కోర్సులలో ఖాళీల వివరాలు

బీఏ(ఈపీహెచ్)లో 25 సీట్లు, బీఏ(హెచ్‌పీఈ) 16, బీకాం(జీ) 16, బీకాం(సీఏ) 13, బీకాం (బీయూఎస్.ఏఎన్) 26, బీఎస్‌సీ(బీజెడ్‌సీ) 22, బీఎస్‌సీ(బీబీసీ) 31, బీఎస్‌సీ(ఎంపీసీ) 35, బీఎస్‌సీ(ఎంపీసీఎస్) 26, బీఎస్‌సీ(ఎంఎస్‌సీఎస్) 30, బీఎస్‌సీ(ఎంఎస్‌డీఎస్) 34 ఖాళీలు ఉన్నాయి.

నూతన చట్టాల ప్రకారం శిక్ష

అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ వ్యాప్తంగా నూతన చట్టాలు అమలవుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించి నేరాలు చేస్తే కొత్త చట్టాల ప్రకారం నేరస్తులకు కఠిన శిక్షలు అమలవుతాయని అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేసీఆర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు.

లిక్కర్, గుట్కాలు సీజ్..

అంతకు ముందు అదే కాలనీ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఎలాంటి పేపర్లు లేని 20 మోటార్ సైకిళ్లు, 20 లీటర్లు లిక్కర్, రూ.10 వేల విలువ గల ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

సంగారెడ్డి: ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో బుధవారం ఇంటి ఎదుట రోడ్డుపై ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుక్కల గుంపు బాలుడిపై దాడి చేసింది. బాలుడి అరుపులతో చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను తరిమి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం ఆస్పత్రికి తరలించారు. అధికారులు కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇద్దరు అదృశ్యం


బంధువుల ఇంటికొచ్చి యువకుడు

ఝరాసంగం(జహీరాబాద్):యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు కాలనీకి చెందిన చిట్టెంపల్లి దిలీప్ జూన్ 26న శుభకార్యం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రమైన ఝరాసంగం గ్రామంలోని బంధువుల ఇంటికొచ్చారు. 28న రాయికోడ్ మండలంలోని మహబత్‌పూర్ గ్రామంలో వివాహం ఉండటంతో ఝరాసంగం నుంచి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి దిలీప్ కనిపించకుండా పోయాడు. బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తల్లి చిట్టెంపల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ రెడ్డి వెల్లడించారు.

శివ్వంపేటలో యువతి

శివ్వంపేట(నర్సాపూర్): యువతి అదృశ్యమైన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కర్రె నవ్య మంగళవారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లగా ఇంట్లో నుంచి వెళ్లి పయింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. బుధవారం యువతి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆస్తి తగాద విషయంలో అన్నను చంపిన తమ్ముడు, అతడి కుటుంబ సభ్యులను హద్నూర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. జహీరాబాద్ రూరల్ సీఐ నయిమొద్దీన్ కథనం మేరకు.. ఆస్తి విషయమై మంగళవారం మండల పరిధిలోని మల్గి గ్రామానికి చెందిన తెలుగు బాబును అతడిగ తమ్ముడు వైజ్యనాథ్, అతడి కుటుంబ సభ్యులు హత్య చేసి పరారైన విషయం తెలిసిందే. నిందితుల కోసం గాలిస్తుండగా మండల పరిధిలోని కల్బెమల్ గ్రామంలో ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే నిందితులైన వైజ్యనాథ్, అతడి కుటుంబ సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

జేఎన్‌టీయూలో విద్యార్థుల ఆందోళన

హాస్టల్లో భోజనం సరిగా లేదని ఆరోపణ

సంగారెడ్డి : సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాలలో హాస్టల్ భోజనం సరిగా లేదని విద్యార్థులు బుధవారం సాయంత్రం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మెస్ కాంట్రాక్టర్ నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. ఆహార పదార్థాలు నోటిలో పెట్టుకోలేకపోతున్నామన్నారు. అర్ధకాలితో అలమటిస్తున్నామని మండిపడ్డారు. ఈ విషయమై యాజమాన్యం పట్టించుకోవాలన్నారు. వెంటనే అతడిని మార్చాలని డిమాండ్ చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ స్పందించి మెస్ కాంట్రాక్టర్‌ను మారుస్తామని, నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

అరుదైన పురాతన విగ్రహం గుర్తింపు



రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రమైన రాయపోలులోని గణపతి దేవాలయం ఆవరణలో అరుదైన పురాతన విగ్రహం గుర్తించినట్లు తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల పలుచోట్ల పరిశోధనలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాయపోలులోని గణపతి విగ్రహం దగ్గర కొన్ని విరిగిపోయిన విగ్రహాలున్నాయని, దీన్ని సిడితల వీరగల్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఆత్మహుతి చేసుకున్న వీరగల్లు విగ్రహంగా వివరించారు. రెండస్తులున్న ఈ వీరగల్లు విగ్రహంలో మొదటి అంతస్తులో ఓ వీరుడు కూర్చుని ఉండగా.. అతడి తల తెగి ఉందన్నారు. ఇలాంటి శిల్పాన్ని సిడితల వీరగల్లు అంటారని, ఇలాంటివి తెలంగాణలో ఇప్పటి వరకు పదికిలోపుగా లభించాయన్నారు. శైవ భక్తులు ఆత్మ బలిదానాలను ధర్మకార్యంగా, శివుని సన్నిధికి చేర్చే తక్షణమార్గంగా ఎంచుకునేవారని వివరించారు. అలాగే ఇక్కడ కొన్ని చాళుక్య, రాష్ట్ర కూటుల కాలానికి చెందిన శిల్పాలు కూడా ఉన్నట్లు తెలిపారు.

సిబ్బంది సమన్వయలోపంతో

విద్యుత్‌శాఖ ఉద్యోగి బలి

- ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా
- జేఎల్‌ఎం మృతి.. మరొకరికి గాయాలు
- మృతదేహాన్ని తరలించకుండా అడ్డగింత
- ఆరు గంటల పాటు ఉద్రిక్తత



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



చంద్రశేఖర్ (ఫైల్)



గాయపడ్డ మాణిక్యం

వట్‌పల్లి(అందోల్): విద్యుత్‌శాఖ సిబ్బంది సమన్వయలోపంతో ఆ శాఖ ఉద్యోగి బలయ్యాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఎర్రారం శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. డాకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రారం, డాకూరు గ్రామాల పరిధిలో బుధవారం రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు చేపట్టారు. డాకూరు పరిధిలో పనిచేస్తున్న జేఎల్‌ఎం శ్రీనివాస్ ముందుగా సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ కోసం (లైన్‌కట్) అనుమతి తీసుకొని పనులు ప్రారంభించాడు. అదే సమయంలో ఎర్రారం సబ్‌స్టేషన్ పరిధిలో జేఎల్‌ఎం చంద్రశేఖర్ కూడా ఎల్‌సీ కోసం అనుమతి తీసుకొని ఆర్టిజన్ కార్మికుడు మాణిక్యంతో కలసి ఎర్రారం శివారులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేపడుతున్నారు. పని పూర్తయిందని ముందుగా ఎల్‌సీ తీసుకున్న డాకూరు జేఎల్‌ఎం శ్రీనివాస్ ఎల్‌సీని రిటన్ చేశాడు. అయితే.. చంద్రశేఖర్ ఎల్‌సీ తీసుకున్న విషయాన్ని సిబ్బంది గుర్తుకు పెట్టుకోకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మరమ్మతు పనుల్లో ఉన్న చంద్రశేఖర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు, ఆర్టిజన్ కార్మికుడు మాణిక్యం గాయాలతో బయటపడ్డాడు. చికిత్స కోసం హైదరాబాద్‌కి తరలించారు.

మృతదేహం తరలించకుండా అడ్డగింత

మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించేందుకు సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కుమార్ తమ సిబ్బందితో ప్రయత్నించగా కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇక్కడికి రావాలని బైఠాయించారు. ఆరుగంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను రప్పించారు. అయినా అధికారులు రావాల్సిందేనని పట్టుబట్టారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్థానిక నాయకులు, అధికారుల ద్వారా మంత్రి దామోదర హామీనిచ్చారు. దీంతో బాధిత కుటుంబీకులతో చర్చలు జరిపి మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనకు కారకులైన సబ్‌స్టేషన్ ఆపరేటర్ పాపగాడ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈ తెలిపారు.

డీఈ, యూనియన్ నాయకుల చర్చలు

ప్రభుత్వ పరంగా మృతుడు చంద్రశేఖర్ కుటుంబానికి రావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వచ్చేలా చూస్తామని జోగిపేట ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ రాష్ట్ర యూనియన్ నాయకుడు భూంరెడ్డి తెలిపారు.

వివరాలు తెలుసుకున్న మంత్రి దామోదర

చంద్రశేఖర్ మృతి చెందిన విషయంపై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఘటనపై అధికారుల ద్వారా విచారణ జరిపించి బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా లభించే అన్ని సదుపాయాలను కల్పించే విషయమై చర్యలు తీసుకుంటుందని మంత్రి సూచించారు. ఈ సంఘటనలో గాయపడ్డ మాణిక్యంకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌తో స్వయంగా మాట్లాడి ఆదేశించారు.

మృతి కుటుంబాన్ని ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే

మృతుడు చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధికారులను కోరారు. గాయపడ్డ మాణిక్యంకు సైతం సాయం అందించాలని కోరారు.

ఊర కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కొండపాక(గజ్వేల్): ఊర కుక్కలు దాడిలో 15 గొర్రె మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన దుద్దెడ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గుర్రాల యాదయ్యకు వ్యవసాయ భూమి లేకపోవడంతో గొర్రెలను సాకుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరి భాగంగా ఇంటికి సమీపంలో ఉన్న షెడ్డులో జీవాలను ఉంచాడు. మంగళవారం అర్ధరాత్రి వర్షం పడుతున్న క్రమంలో గొర్రెలపై ఊర కుక్కలు దాడి చేశాయి. వాటి అరుపులు విన్న యాదయ్య షెడ్డులోకి వెళ్లి చూడగా అప్పటికే 15 గొర్రెలు చనిపోయి ఉన్నాయి. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, పీఏసీఎస్ డైరెక్టరు శాలయ్య, మాజీ ఉప సర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, నాయకులు దోమల ఎల్లం, జక్కుల స్వామి, గుర్రాల కనకయ్య, నర్సింలు తదితరులు బాధితుడిని పరామర్శించారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

నారాయణఖేడ్: మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారాయణఖేడ్ యువకుల అంత్యక్రియలు బుధవారం కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య జరిగాయి. పూణె జిల్లా ఇందాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి అక్కడి పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. ఖేడ్ పట్టణానికి చెందిన రఫీక్ ఖురేషి(26), మహబూబ్ ఖురేషి (28) మృతదేహాలను అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. మధ్యాహ్న సమయంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఫిరోజ్ ఖురేషి(27), మజీద్ పటేల్(26) మృతదేహాలను నేరుగా అక్కడికి తరలించగా, కంగ్టికి చెందిన ఫిరోజ్ ఖురేషి(25) మృతదేహాన్ని కంగ్టికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ ఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ అమర్(25) పూణెలో చికిత్స పొందుతున్నాడు.

నేతల నివాళులు

ఖేడ్‌లో మృతదేహాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు సాగర్ షెట్కార్, తాహెర్ అలీ, ముంతాజ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. కంగ్టిలో మృతదేహానికి డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మనోజ్ పాటిల్, నాయకులు నాగన్న, శ్రీనివాస్ రెడ్డి, మైనొద్దీన్, రాజు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ప్రాణం తీసిన అతివేగం

- రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి.. డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- యువకుడు మృతి, ఇద్దరికి గాయాలు

గజ్వేల్‌రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడితోపాటు వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన గట్టు రమేశ్ యాదవ్–లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కొడుకు శ్రవణ్‌యాదవ్(16) ప్రజ్ఞాపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవలె 10వ తరగతి పూర్తి చేశారు. శ్రవణ్ తన మిత్రుడైన త్రినాథ్‌తో కలిసి పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే మార్గంలో బాలాజీ టిఫిన్ సెంటర్ సమీపంలో రోడ్డు దాటుతున్న కనకయ్య అనే వ్యక్తిని తప్పించబోయి వీరి బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న నడుపుతున్న త్రినాథ్‌తోపాటు రోడ్డు దాటుతున్న కనకయ్యలకు గాయాలయ్యాయి. బైక్ వెనుకాల కూర్చున్న శ్రవణ్‌యాదవ్ డివైడర్‌పై నుంచి రోడ్డుకు అవతలివైపు పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జక్కాపూర్ గ్రామానికి చెందిన నక్క కాంతయ్య (57) గుర్రాలగొందిలోని అంగడిలో కూరగాయలు అమ్ముకునేందుకు వెళ్లాడు. రాత్రి 8 గంటలకు గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. జక్కాపూర్ శివారు వద్దకు రాగానే సిరిసిల్ల నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు కాంతయ్యను ఢీకొట్టింది. స్థానికులు సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు కాంతయ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాంతయ్యకు భార్య, నలుగురు కూతర్లు ఉన్నారు. కారులోని వ్యక్తులు వాహనాన్ని వది పరారైనట్లు, సిరిసిల్లకు చెందిన వ్యక్తులుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మరో ప్రమాదంలో వృద్ధుడు..

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. మండలంలోని పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన ముక్కపల్లి రాజయ్య(87) జ్వరం రావడంతో తిమ్మాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యం చేయించుకొని ఇంటికెళ్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న ఓ ఆటో రాజయ్యను ఢీకొట్టింది. వెంటనే సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.